క్లుప్తంగా

27న ఎలక్ట్రీషియన్స్ డే వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 27వ తేదీన మాచవరంలోని ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎలక్ట్రీషియన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీహరిరావు తెలిపారు. స్థానిక మాచవరం ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు ధనేకుల సత్యనారాయణతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా థామస్ అల్వా ఎడిసన్ బల్బు కనిపెట్టిన జనవరి 27వ తేదీన ఎలక్ట్రీషియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మాచవరంలోని కార్యాలయంలో జరిగే ఈ వేడుకల్లో కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ది విజయవాడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, కన్వీనర్ వై.శంకరరావు, కోశాధికారి రామ్మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మెదడులో వచ్చే మార్పులపై పరిశోధనలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మానవ మెదడులో వచ్చే మార్పుల అధ్యయనానికి ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయని సీనియర్ రేడియాలజిస్ట్ డాక్టర్ టి.రాజేశ్వరరావు పేర్కొన్నారు. అత్యంత సూక్ష్మభాగాలను చిత్రీకరించే ఆధునిక 3 టెస్లా ఎంఆర్‌ఐ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. డోర్నకల్‌రోడ్డులోని నూతనంగా ఏర్పాటు చేసిన ఏబీసీ ఇమేజింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌ను ఆదివారం నగరంలోని పలువురు ప్రముఖ వైద్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎంఆర్‌ఐ స్కానింగ్ అనేది మాగ్నెటిక్ రిజోనెన్స్ ఇమేజింగ్ సాంకేతికతతో పనిచేస్తుందన్నారు. మాగ్నెటిక్ పవర్ ఆధారంగా శరీర అవయవాల్లోని అత్యంత సూక్ష్మ సిగ్నల్స్‌ను చిత్రీకరించే అధునాతన యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మానవ మెదడు పూర్తి అనాటమీ, బ్లడ్ సర్క్యులేషన్, ట్యూమర్, ఇన్ఫెక్షన్, ఫంక్షనింగ్ తదితరాలను చిత్రీకరించే అడ్వాన్స్‌డ్ సదుపాయాలతో కూడిన ఎంఆర్‌ఐతో పూర్తి రిపోర్టు ఇవ్వగలమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఎస్.సుబ్బారావు, డాక్టర్ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ కార్తీక్ తుమ్మల, డాక్టర్ టి.గౌతమి చౌదరి, డాక్టర్ కౌశిక్ పాల్గొన్నారు.

నాక్ గుర్తింపు వచ్చేందుకు సహకరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీకి నాక్ గుర్తింపు వచ్చేందుకు విద్యార్థులు సహకరించాలని యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆదివారం నాక్ గుర్తింపు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాక్ గుర్తింపు కోసం వచ్చే మెయిల్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి సమాధానాలు ఇవ్వాలని సూచించారు. అలాగే మెయిల్స్ ఎలా వస్తాయి, ఏ విధంగా రిప్లై ఇవ్వాలి తదితర విషయాలను తెలియజేశారు.

సేవలు విస్తృతం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల సమస్యలను గుర్తించి, వాటికి అనుగుణంగా సేవలు అందించాలని దాత, విజయ్ విద్యా సంస్థల అధినేత తట్టి అర్జునరావు సూచించారు. స్థానిక లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ జెమ్స్ ఆధ్వర్యంలో విజయవాడ ఈస్ట్ జెమ్స్ అండ్ రాయల్స్ చారిటబుల్ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం దుర్గాపురంలో జరిగింది. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మెరుగైన సేవలు అందించేందుకు తాను తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఫౌండేషన్ అధ్యక్షులు జాస్తి ప్రసాద్, కోశాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా తాము ఉచిత,పర్మినెంట్ డయాబెటిక్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని క్యాంప్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొల్లి శ్రీధర్, కార్యదర్శి ఎన్‌వీఆర్, కోశాధికారి దారా మురళీకృష్ణ, సుబ్బరాజు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సూర్యారాధన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో సూర్యారాధన కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాఘమాసం, ఆదివారం కావడంతో ఆలయం ప్రాంగణంలో సూర్యుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం తొలిరోజే ఆదివారం కావడంతో భారీగా భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు.





ప్రశాంతంగా పోలీస్ నియామక రాత పరీక్ష





నగరంలో ఆదివారం నిర్వహించిన పోలీస్ నియామక రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కాకరపర్తి భావనారాయణ తదితర కళాశాలలో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. పోలీసులు తొలుత తనిఖీలను నిర్వహించి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష కొనసాగింది. పరీక్ష కేంద్రాల వద్దకు అభ్యర్థులతో పాటుగా వారి తల్లిదండ్రులు కూడా రావడంతో ఆయా ప్రాంతాలు రద్దీగా మారాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









వైభవంగా శ్రీవారి కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయాల్లో ఒకటైన వన్‌టౌన్ బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ పరిధిలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలోని వేదికపై స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మాఘమాసం అందులోనూ తొలి రోజు ఆదివారం సూర్యనారాయణ మూర్తికి ప్రీతికరమైన రోజు కావడంతో స్వామికి సైతం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుణ్యాహవచనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, జీలకర్రబెల్లం ధారణ మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

శాస్త్రోక్తంగా తిరుమంజనం

స్వామి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి తిరుమంజనోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ఆదివారం ఉదయం నిర్వహించారు. అంతరాలయంలో మూలవిరాట్‌కు జరిగే ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతాలు, వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో కూడిన అభిషేకాలను నిర్వహించారు. ఆలయ అర్చకస్వాములు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

హోమియోపతితో అన్ని వ్యాధులు నయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని రకాల వ్యాధులకు హోమియోపతి చికిత్సతో ఎటువంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా నయం చేయవచ్చని ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోన వీరబ్రహ్మం పేర్కొన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి తగ్గించుకుని క్రమం తప్పకుండా భోజనం, వ్యాయామం చేయాలని సూచించారు. వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స కన్నా నివారణ పద్ధతులు పాటించాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు మాట్లాడుతూ తాము ప్రతి ఆదివారం ఉచితంగా హోమియో, ఆయుర్వేదం, అల్లోపతి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య ఆయుర్వేద వైద్యనిపుణురాలు డాక్టర్ చాందిని పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామబ్రహ్మం

హనుమంతరావు సేవలు నిరుపమానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పద్మభూషణ్ మాడపాటి హనుమంతరావును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని మాజీ డిప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు పిలుపునిచ్చారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీఅల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయంలో ఆదివారం హనుమంతరావు జయంతి కార్యక్రమం జరిగింది. హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రోద్యమం, గ్రంథాలయ ఉద్యమంలో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్బరాజు, పీవీ సుబ్బరాజు మాట్లాడుతూ గ్రంథాలయ వజ్రోత్సవ వేడుకలలో భాగంగా హనుమంతరావు జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. తమకు సహకరిస్తున్న అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర రాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు, కె.ప్రసాదరాజు మాట్లాడారు. కార్యక్రమంలో పీ రాంబాబు కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణంరాజు, శ్రీనివాసరాజు, పిచ్చిరాజు, పీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



హనుమంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీతారామరాజు స్మారక గ్రంథాలయం, సాంస్కృతిక సంఘం సభ్యులు

తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ అక్కినేని

విజయవాడ కల్చరల్: తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ అక్కినేని నాగేశ్వరరావు అని శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సాంస్కృతిక సాహిత్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం సినీ నటుడు, నిర్మాత, స్టూడియో అధినేత అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా సాహితీ సంస్థల ప్రతినిధులకు అక్కినేని స్మారక పురస్కారాలు, అక్కినేనికి స్వరాజంలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కినేని సినీ జీవితానికి బీజాలు పడింది విజయవాడ రైల్వేస్టేషన్‌లోనే అని పేర్కొన్నారు. దర్శకుడు ఘంటసాల బలరామయ్యద్వారా తెలుగు సినిమా రంగానికి పరిచయం అయ్యాడన్నారు. సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలోని హనుమంతరాయా గ్రంథాలయం అభివృద్ధికి సహాయపడ్డారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణ మూర్తి నాగేశ్వరరావు సినీ రంగ విశేషాలను వివరించారు. సాహితీ సంస్థల ప్రతినిధులు బీ నరసింహారావు, డీ వెంకటరమణ, బీ నెల్సన్‌కు అక్కినేని స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రసూనారామన్, బాలాజీకుమార్, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.



అక్కినేని స్మారక పురస్కారాలను ప్రదానం చేస్తున్న రమాసత్యనారాయణ

మహిళ అనుమానాస్పద మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసుస్టేషన్ పరిధి కండ్రికలో తిరుమలశెట్టి రాజేశ్వరి(24) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందినట్లు కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు కండ్రికకు చెందిన ఫిర్యాది మోపిదేవి వెంకటేశ్వరమ్మ కుమార్తె రాజేశ్వరికి ఉప్పులూరుకు చెందిన తిరుమలశెట్టి నాగరాజుతో 2016వ సంవత్సరంలో వివాహం జరిగింది. నాగరాజు వెల్డింగ్ పని చేస్తుంటాడు. వారికి ఇద్దరు పిల్లల సంతానం. రాజేశ్వరికి కాలు నొప్పి ఉండడంతో రెండు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకుని బాధపడుతోంది. సంక్రాంతి సందర్భంగా పుట్టింటికి వచ్చి ఉంటోంది. శనివారం సాయంత్రం వెంకటేశ్వరమ్మ ఇంటికి వచ్చి చూడగా తలుపు గడియ పెట్టి ఉంది. తలుపు గట్టిగా నెట్టి లోనికి వెళ్లగా వంట గదిలో ఉన్న రాడ్‌కు రాజేశ్వరి చీరతో ఉరివేసుకుని ఉంది. వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై ఉన్న పేదలకు ఆజాద్ ముస్లిం కమిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు భోజనం ప్యాకెట్లు, పండ్లు ఆదివారం అందజేశారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా తెలిపారు. ముస్లిం మైనార్టీల సమస్యలపై పోరాడేందుకు, పేద ముస్లింలకు అండగా నిలిచేందుకు 2018లో ఈ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి షేక్ షాజిద్‌అలీ, ఉపాధ్యక్షుడు ఎండీ కాలేషా, ప్రతినిధులు సయ్యద్‌మౌలాలి, హుస్సేన్, షరీఫ్, షేక్ మస్తాన్, షేక్ ఆదంషరీఫ్, షేక్ మస్తాన్, షేక్ బిలాల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో శాంతిస్థాపన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి వర్ధిల్లుతుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రవచనకర్త కంభంపాటి రామమూర్తి అన్నారు. పాత బస్తీలోని శాంతి సత్సంగ మండలి వార్షికోత్సవ వేడుకలను పాతబస్తీలోని రాయల్ బంక్వెట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రామమూర్తి మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో ప్రజలు ముందుకు సాగాలన్నారు. భగవంతుని కృప ఉంటే మానవులు సాధించలేనిది లేదన్నారు. భారతీయ సనాతన ధర్మాన్ని అందరూ అనుసరించాలన్నారు. రానున్న తరాలకు వారసత్వంగా వస్తున్న భారతీయ సంప్రదాయాలను అందించాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ శాంతి సత్సంగ మండలి సేవలను కొనియాడారు. ప్రముఖ న్యాయవాది నరహరశెట్టి శ్రీహరి మాట్లాడుతూ విజయవాడ పాతబస్తీలో శాంతి సత్సంగ మండలి అద్భుతమైన పాత్ర పోషించిందన్నారు. సంస్థ అధ్యక్షుడు కూరపాటి సత్యనారాయణ, కన్వీనర్ పురుషోత్తమరావు, ప్రధాన కార్యదర్శి వెజ్జు సాంబశివరావు, కోశాధికారి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

26న సూర్యనారాయణ స్వామి ఆలయ శంకుస్థాపన



భవానీపురం(విజయవాడపశ్చిమ): గుంటూరు జిల్లా పెనుమాక గ్రామంలోని శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్రం రామానుజన్ నగర్‌లోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయానికి ఈ నెల 26వ తేదీ ఉదయం 9.45 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైష్ణవ మహా దివ్య క్షేత్రం అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆదివారం విజయవాడలోని ఒక హోటల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ రథసప్తమి సందర్భంగా దేవాలయ మాడవీధుల్లో ఉదయం 5.30 గంటలకు వాహన సేవలు సూర్య ప్రభ వాహనంతో ప్రారంభమై రాత్రి ఎనిమిది గంటలకు చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయని చెప్పారు. సమావేశంలో కమిటీ సెక్రటరీ దూబగుంట శ్రీనివాసరావు, కోశాధికారి ఆర్ ఉమామహేశ్వర గుప్తా, సభ్యులు వక్కలగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్కినేనికి భారతరత్న పురస్కారం కోసం వినతి

విజయవాడ కల్చరల్: సినీ నటుడు నిర్మాత అక్కినేని నాగేశ్వరరావుకు భారతరత్న పురస్కారం కోసం ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకుంటున్నామని అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకల నిర్వహణ సన్నాహక జాతీయ ప్రతినిధుల సమావేశం నిర్వహించింది. సభకు అధ్యక్షత వహించిన చీదెళ్ల మాట్లాడుతూ తెలుగు సినీ రంగచరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగమని భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు చాటిచెప్పేలా ఆయన అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించారన్నారు. ఫౌండేషన్ ద్వారా భావితరాలకు కూడా గుర్తుండిపోయేలా కార్యక్రమాలను చేస్తామన్నారు. కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ప్రపంచం గర్వించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని స్వరాజ్యమైదానంలో నిర్మించి చరిత్రకు కొత్త అర్థం చెప్పిందన్నారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లాను ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందన్నారు. అక్కినేని కోసం ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినీ క్రిటిక్ సంజయ్ కిషోర్ మాట్లాడుతూ అక్కినేని లేని తెలుగు సినీ చరిత్రను ఊహించలేమన్నారు. తెలుగు సినిమారంగాన్ని మద్రాస్‌నుంచి హైదరాబాద్ తీసుకురావడానికి ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. తొలుత అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. వివిధ ప్రాంతాల ప్రతినిధులు కేవీఎస్ సత్యనారాయణ, ఓం నమశ్శివాయ, ఆదినారాయణ, నవీన్ ప్రసాద్, ఇబ్రహీం ఖాన్, సూరిబాబు, విజయరాజ్, పొన్నాడ మోహన్ రావు, మణిబాబు పాల్గొన్నారు.



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాతీయ స్థాయి ప్రతినిధులు

శ్రావ్యంగా సాగిన స్వరలయ సౌరభం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మమణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం యువ, చిన్నారి సంగీత కళాకారులు నిర్వహించిన స్వరలయ సౌరభం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు వాగ్గేయకార కృతులను ఆలపించారు. జూనియర్ విభాగంలో వీ భాను, మంగళగిరి శ్రీవ్యాస్, కే శ్రావ్య శ్రీవాణి, కే మహిత్ గాత్ర సంగీతంతోనూ, ఎ.శృతి, వీ సాత్విక వీణ తోనూ శ్యామ కృష్ణ మృదంగంతోనూ అలరించారు. సీనియర్ విభాగంలో నిమ్మగడ్డ నయన, డీ. మహలక్ష్మి, టీ నాగ ఫణికృష్ణ, టీ పవిత్ర, సీనియర్ విభాగంలో అయ్యప్పన్ ప్రణతి, మనసిజ, పీవీఎల్ మహతి త్యాగరాజ కృతులను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు పీ గౌరీనాథ్ మాట్లాడుతూ బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తున్న సంగీత సమితి సేవలను అభినందించారు. చదువులపట్ల ఆసక్తితోపాటు లలిత కళలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. సంగీత సమితి కార్యదర్శి సీవీ రావ్ మాట్లాడుతూ ప్రతి ఏటా సంగీతంలోని వివిధ అంశాలలో పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానోత్సవంతోపాటు వారికి వేదిక మీద అవకాశం కల్పిస్తునట్లు తెలిపారు. విద్యావేత్త ఎంసీ దాస్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు.



వాగ్గేయకార కృతులను గానం చేస్తున్న భాను

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం

భవానీపురం(విజయవాడపశ్చిమ): బీసీ కార్పొరేషన్ల పదవీ కాలాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల పదవీ కాలం ముగిసినా మరోమారు అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు అన్ని కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు అందరూ జీవితాంతం రుణపడి ఉంటారని తెలిపారు. వెనుకబడిన తరగతులలో ఎన్ని కులాలు, ఉపకులాలు ఉన్నాయో ఎవరికీ తెలియని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 139 కులాలను గుర్తించి 56 సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఘనత దేశంలో మరే ముఖ్యమంత్రికి దక్కలేదని తెలిపారు. సీఎం జగనన్న బీసీలకు అన్నింటా పెద్ద పీట వేస్తున్నారని, వారంతా ఆయన వెంటే ఉంటూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసి తీరతారని పేర్కొన్నారు. చట్ట సభల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 70 శాతం మందికి అవకాశం కల్పించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన సీఎం జగన్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారని పేర్కొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ సెంట్రల్ :
9010201611
Office mail : sakshiads@gmail.com